యాసంగి సాగు ఎలా?

- ఎండిన మానేరు, చలివాగు
- ఆందోళనలో రైతులు
- ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని వేడుకోలు



టేకుమట్ల: మండలంలోని అన్ని గ్రామాల రైతులు ఎక్కువగా వరి పంటలను సాగు చేస్తున్నారు. వానాకాలం లోకల్ వరి సాగు చేస్తూ, యాసంగిలో లోకల్ వరితో పాటు ఆడ మగ వరి పంటలను సాగు చేస్తుంటారు. పలు గ్రామాల్లో రైతులు బావులు, బోర్లపై ఆధారపడి పంటలను పండిస్తున్నారు. కానీ మండలంలోని సుబ్బక్కపల్లి, సోమనపల్లి, అంకుషాపూర్, టేకుమట్ల, రాఘవరెడ్డిపేట, గుమ్మడవెల్లి, ఆశిరెడ్డిపల్లి, పండిగిపల్లి, వెలిశాల, రామకిష్టాపూర్(టి), గుమ్మడవెల్లి, కుందనపల్లి, బూర్నపల్లి, ఎంపేడు, వెంకట్రావుపల్లి, కలికోట, గర్మిళ్లపల్లి రైతులు ఎక్కువగా చలివాగు, మానేరుపై ఆధారపడి వరి పంటను సాగు చేస్తారు.

మానేరు, చలివాగులో యాసంగిలో వరి నాట్లు ప్రారంభం అవుతుండగా మానేరు, చలివాగులో చుక్కా నీరు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. చలివాగు, మానేరు ఆధారిత రైతులు సుమారు 2వేల ఎకరాలకు పైగా ఉండగా పంటకు సరిపడ నీళ్లు అందేనా? యాసంగి సాగు ఎలా? అని సందేహం వ్యక్తం చేస్తున్నారు. నాటు దశలోనే వాగులో నీళ్లు లేకపోవడంతో తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగులో నీరు పూర్తిగా ఎండిపోవడంతో ప్రతీ సంవత్సరం లాగానే చలివాగులో ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయడం వల్ల చలివాగు, మానేరు పరివాహక ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీటి ఎద్దడిని నివారించవచ్చని తెలుపుతున్నారు.

కౌలుకు తీసుకున్నా..



వాగొడ్డుకు మూడెకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నా. ఇప్పుడే వాగులో చుక్కా నీరు లేదు. మరో మరికొన్ని రోజుల్లో చలివాగులో భూగర్భ జలాలు సైతం అడుగంటి సాగు నీటికి ఇబ్బంది ఉంటుంది. పంట చేతికి రావాలంటే వాగులోకి నీటిని విడుదల చేయాలి.

- సరోత్తంరెడ్డి, కౌలు రైతు, టేకుమట్ల

పన్నెండు ఎకరాల్లో సాగు చేస్తున్నా..



చలివాగు ఒడ్డుకు పన్నెండు ఎకరాలను కౌలుకు తీసుకుని ఆడ, మగ వరి పంటను సాగు చేస్తున్నా. ఇప్పుడు చలివాగులో వేసిన బోర్లతో నీరు సరిపోతుంది. కానీ వాగులో నీళ్లు లేకపోవడంతో మరి కొన్ని రోజుల్లో సాగు నీటికి తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుందని భయంగా ఉంది. వాగులో కాలువ నీళ్లు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. లేదంటే చలివాగు రైతులు అప్పులు పాలు కాక తప్పదు.

- రవీందర్, కౌలు రైతు, కుందనపల్లి

క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఆహ్వానం



భూపాలపల్లి అర్బన్: హైదరాబాద్‌లో నేడు (ఆదివారం) నిర్వహించనున్న రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం ప్రోత్సహక పథకం పంపిణీ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు ఆహ్వానపత్రం అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదగా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత

భూపాలపల్లి అర్బన్: మండల పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి అందజేసినట్లు సీఐ నరేష్‌కుమార్ శనివారం తెలిపారు. రామగిరి తిరుపతి, పల్ల సంపత్ రెడ్డి, బండి రాజ్‌కుమార్ సెల్‌ఫోన్లు పొగొట్టుకోవడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో విచారణ చేపట్టి ముగ్గురి ఫోన్లు రికవరి చేసి అందజేసినట్లు తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ



కాటారం: తెలంగాణ సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. టాలెంట్ టెస్ట్‌లో జి.మేఘన, జె.రమ్య ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచారు. నిర్వాహకులు వీరికి ప్రశంస పత్రాలు అందజేయడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఫోరం అధ్యక్షుడు గుగ్లోత్ రామ్‌నాథ్, ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, సోషల్ ఉపాధ్యాయినీలు విజయలక్ష్మి, గౌతమి అభినందించారు.

గుర్తింపు తెచ్చుకోవాలి



కాటారం: విధులు నిర్వర్తించిన చోట ప్రజల మన్ననలు పొందేలా సేవ చేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని సీఐ నాగార్జునరావు అన్నారు. కాటారం పోలీస్‌స్టేషన్‌లో కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ఏఎస్సై మొగిలి, హెడ్ కానిస్టేబుల్ వెంకటేషం, కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సీఐ నాగార్జునరావు, ఎస్సై మ్యాక అభినవ్ బదిలీపై వెళ్తున్న వారిని శాలువాతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ, ఎస్సై, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'దళితబంధు'ను కొనసాగించాలి

కాటారం: దళితుల ఆర్థిక అభివృద్ధి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని నేతకాని సంఘం జిల్లా నాయకుడు జాడి శ్రీశైలం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండో విడతలో లబ్ధిదారుల ఎంపిక జరిగినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల కారణంగా అర్థాంతరంగా పథకం వర్తింపు నిలిచిపోయిందని తెలిపారు.

పరామర్శ

చిట్యాల: మండలంలోని నవాబుపేటకు చెందిన తిప్పని అశోక్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శనివారం పరామర్శించి 50కేజీల బియ్యంతో పాటు రూ.4వేలు ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల నాయకులు పిట్ట సురేశ్, గ్రామ శాఖ అధ్యక్షుడు సాద రాజు, మాజీ డైరెక్టర్ హైమత్‌పాషా, నాయకులు రఫీ, వలబోజుల నరేష్ పాల్గొన్నారు.

టేకుమట్లలో..

టేకుమట్ల: మండలంలోని ఆశిరెడ్డిపల్లి బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జెట్టి మహేందర్ తండ్రి రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శనివారం పరామర్శించారు. మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, గర్మిళ్లపల్లి మాజీ సర్పంచ్ నల్లబెల్లి రవీందర్, ఎండీ అప్జల్, శంకర్ ఉన్నారు.

మొగుళ్లపల్లిలో..

మొగుళ్లపల్లి: మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సినియర్ నాయకుడు లాడే సమ్మారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించి వారి కుటుంబానికి ప్రఘాడ సానుభూతి తెలిపారు. ఆయన వెంట చిట్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోడారి రమేశ్, నాయకులు ఉన్నారు.

ఉనికి కోసమే బీఆర్ఎస్ నాయకుల దీక్షలు

- కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు దేవన్


మాట్లాడుతున్న దేవన్

భూపాలపల్లి రూరల్: బీఆర్ఎస్ నాయకులు ఉనికి కోసమే నిరసన దీక్షలు చేస్తున్నారని కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు దేవన్, పీసీసీ సభ్యుడు చల్లూరి మధు అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. భాస్కర్‌గడ్డలో బీఆర్ఎస్ నాయకులు గతంలో కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇళ్లల్లో 392 మంది లబ్ధిదారుల్లో 300లకు పైగా ఇళ్లు ఉన్నవారి దగ్గర లంచాలు తీసుకోని కేటాయించారని ఆరోపించారు. నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూంలు కేటాయించే విధంగా అధికారులతో ఎమ్మెల్యే సత్యనారాయణరావు సర్వే చేయించారన్నారు. పాత లబ్ధిదారుల్లోని పేదలతో పాటు, పార్టీలకతీతంగా పేదలకు ఇళ్లు కేటాయించడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు ప్రజలను, లబ్ధిదారులను తప్పుత్రోవపట్టించేందుకు దీక్షలు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బీఆర్ఎస్ నాయకులకు నిరసన దీక్షలు చేసే అర్హత లేదని అన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ యువజన జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, నాయకులు రాజేందర్, మహేందర్, సహదేవ్, అశోక్, మాలతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను పట్టించుకోకపోవడం సరికాదు

- ఎమ్మెస్పీ జిల్లా నాయకుడు ఒదేలు


కార్మికులకు మద్దతు తెలుపుతున్న నాయకులు

చిట్యాల: నాలుగు రోజుల నుంచి హమాలీ కార్మికులు సమ్మె చేస్తున్న కనీసం రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరైందికాదని వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెస్పీ జిల్లా నాయకుడు నేరెళ్ల ఒదేలు డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులు సమ్మె చేస్తున్న శనివారం ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. హమాలీలు డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చి, పెంచిన రేట్లకు సంబంధించిన జీఓను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దొడ్డి శంకర్, ప్రధాన కార్యదర్శి కట్కూరి మొగిలి, హమాలీ కార్మికులు సరిగోమ్ముల సురేశ్, గుర్రం నర్సయ్య, దాసారపు సాంబయ్య, శీలపాక నాగరాజు, ఐలయ్య, ఎల్లయ్య, రాజేందర్, కుమార్, సుమన్, శ్రీనివాస్, వినోద తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఆర్టీఓ సంధాని


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

కాటారం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, ఆర్టీఓ సంధాని అన్నారు. కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ హై స్కూల్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడోత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. డీఎస్పీ, ఆర్టీఓ క్రీడా జ్యోతిని వెలిగించి, క్రీడా జెండాను ఎగరవేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రస్మా ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు నిర్వహించడం అభినందనీయం అని కొనియాడారు. అంతకముందు సబ్ డివిజన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు క్రీడాజ్యోతితో మండల కేంద్రంలోని వీధుల గుండా ర్యాలీ చేపట్టి ఆదర్శ పాఠశాలకు చేరుకున్నారు. కార్యక్రమంలో ఎస్సై అభినవ్, ట్రస్మా ఏరియా కమిటీ అధ్యక్షుడు శ్రీశైలం, జిల్లా జనరల్ సెక్రటరీ సంపత్‌రావు, ఉపాధ్యక్షుడు కార్తీక్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి రాజబాబు, కోశాధికారి వెంకటేష్‌గౌడ్, నాయకులు సమ్మయ్య, ప్రభాకర్‌రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలు పాటించాలి

ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఆర్టీఓ సంధాని, డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం ఆర్టీఓ సంధాని, డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని, మైనర్లను డ్రైవింగ్‌కు ప్రోత్సహించొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సై మ్యాక అభినవ్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, ట్రస్మా ఏరియా అధ్యక్షుడు కొట్టె శ్రీశైలం, వలుస వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

భూపాలపల్లి అర్బన్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపడుతున్న సమ్మెలో భాగంగా శనివారం మోకాళ్లపై నిల్చోని నిరసన వ్యక్తం చేశారు. దీక్ష 27వ రోజు చేరగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నక్క తిరుపతి, కుమారస్వామి, ఆర్పీసీ రాష్ట్ర అధ్యక్షుడు పెండ్యాల దేవరాజు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఉద్యోగులు రామయ్య, రాజయ్య, చాంద్ పాషా, తోకల వేణు, చంద్రకళ పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు సభ్యులు గంగిశెట్టి దయాకర్ జ్ఞాపకార్థం భక్తులు కూర్చోవడానికి 10 సిమెంట్ బెంచీలు ట్రస్టు నిర్వాహకులు, రిటైర్డు గంగిశెట్టి జగదీశ్వర్ శనివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ డి సురేష్ బాబు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

చిట్యాల: జిల్లా కేంద్రంలో 25 రోజులుగా సమ్మె చేస్తున్న తమ సమస్యలను ఎవరు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును మండల కేంద్రంలో కేజీబీవీ ఉద్యోగులు వేడుకున్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూరిభాగాంధీ పాఠశాలలో దుప్పట్లు పంపిణీ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేతో పాఠశాల స్పెషల్ ఆఫీస్ సుమలత, ఉపాధ్యాయులు ఉమా, సబిత, మీనా, కర్ణశ్రీ, హసీనా తదితరులు విన్నవించుకున్నారు. అనంతరం వారితో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈనెల 10న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు విద్యాశాఖ మంత్రితో మాట్లాడి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్ర స్థాయి క్రీడాకారులకు అభినందనలు


ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

టేకుమట్ల: డిసెంబర్ 27 నుంచి జనవరి 2 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులను శనివారం మండల విద్యాధికారి చిదిరాల సుధాకర్ ప్రసంశ పత్రాలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రకాశ్, అనిత, అనురాధ, రమాదేవి, కృష్ణారావు, అంకూస్, తిరుపతి ఉన్నారు.

పీఆర్‌టీయూతోనే సమస్యల పరిష్కారం


చిట్యాల: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ రఘుపతి

చిట్యాల: పీఆర్‌టీయూ టీఎస్‌తోనే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమవుతాయని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్ అన్నారు. ఈమేరకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం పీఆర్‌టీయూ టీఎస్ మండల శాఖ క్యాలెండర్‌ను మండల విద్యాధికారి కొడెపాక రఘుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్ ఆవిష్కరించారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం పీఆర్‌టీయూ కాలెండర్‌ను మండల అధ్యక్షుడు పోలు నాగరాజు, ప్రధానకార్యదర్శి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పింగిలి విజయపాల్‌రెడ్డి, ఎంఈఓ లింగాల కుమారస్వామి ఆవిష్కరించారు.

రోడ్డు భద్రత వారోత్సవాలపై అవగాహన


భూపాలపల్లి అర్బన్: అవగాహన కల్పిస్తున్న సీఐ


రేగొండ: మాట్లాడుతున్న సందీప్ కుమార్

భూపాలపల్లి అర్బన్: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు స్థానిక పోలీసులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సీఐ నరేష్‌కుమార్ హాజరై మాట్లాడారు. లైసెన్స్ లేని వారు వాహనాలు నడుపొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బాలునాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అనిల్‌కుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేగొండ: రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యతని ఎస్సై సందీప్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. రహదారి నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని తెలిపారు. సీటు బెల్ట్ తప్పకుండా ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై దివ్య, ఏఎస్సై రవీందర్ రెడ్డి, కానిస్టేబుల్ రమేశ్, హోంగార్డ్ శ్రీశైలం పాల్గొన్నారు.

'రామకృష్ణకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి'


మాట్లాడుతున్న సురేశ్

భూపాలపల్లి రూరల్: నామమాత్రం ఫీజులతో నిరుపేదలకు హనుమకొండలో కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యాన్ని అందిస్తూ పేదల డాక్టర్‌గా పేరు గాంచిన కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పెరుమాండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీ స్థానాల్లో అవకాశం కల్పించాలని కాకతీయ మ్యూచవల్ ఎయిడెడ్ కో-ఆపరేటీవ్ సొసైటీ (కేమ్యాక్స్) వైస్ చైర్మన్, దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ కోరారు. మండలంలోని నాగారం గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన కే మాక్స్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి డాక్టర్ పెరమాండ్ల రామకృష్ణ కృషి చేశారన్నారు. మాదాసి శ్రీనివాస్, గిన్నారపు మైబు, సుదర్శన్, రాజు, భాస్కర్, ఉపేందర్ పాల్గొన్నారు.

మాధవరావు మృతి ఉద్యమాలకు తీరనిలోటు


సంస్మరణ సభలో నాయకులు

భూపాలపల్లి రూరల్: మానవ హక్కుల కోసం నిరంతరం తపించిన మాధవరావు మృతి ప్రజాస్వామిక ఉద్యమాలకు తీరనిలోటని, మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్ అన్నారు. శనివారం పట్టణంలోని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో మానవ హక్కుల వేదిక నేత గొర్రెపాటి మాధవ రావు సంస్మరణ సభను కర్ణాటక సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్ హాజరై మాట్లాడారు. హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయడమే మాధవరావుకు ఘన నివాళులర్పించడం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య, ప్రజా సంఘాల నాయకులు గట్ల రాజయ్య, మండల యుగేందర్, చల్లగురుగుల సంజీవ్, పీక కిరణ్, జనార్దన్ పాల్గొన్నారు.

వేగంగా ముక్తివనం పార్కు పనులు


కాళేశ్వరం పార్కులో నిర్వహిస్తున్న పనులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో పర్యాటకులు, భక్తులను ఆహ్లాదపరిచేందుకు ముక్తివనం పార్కు అభివృద్ధి పనులు డీఎఫ్ఓ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కాళేశ్వరం పార్కులో రెండు రోజులుగా శరవేగంగా పనులు జరుగుతున్నాయి. ఇటీవల కలెక్టర్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పార్కు అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే సీసీఎఫ్ఓ ప్రభాకర్, డీఎఫ్‌లు పార్కులో అవసరమగు పరికరాలు, ఆట వస్తువుల కొనుగోలు తదితర అంశాలపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. పార్కులో వివిధ రకాల మొక్కల ఏర్పాటుపై కూడా దృష్టిసారించినట్లు సమాచారం. కాగా శనివారం పార్కులో సైక్లింగ్, వాక్‌వే పాత్ పనులు చేపట్టారు. పార్కులోని ట్రీహౌస్‌లకు రంగులు, మరమ్మతులు చేపడుతున్నారు. పార్కు అంతా సుందర వనంగా తీర్చిదిద్దనున్నారు. రానున్న శివరాత్రి వరకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేనున్నారని తెలిసింది.

ముస్సిపల్ కార్మికుల నిరసన దీక్ష


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

భూపాలపల్లి అర్బన్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్మికులు కార్యాలయం ఎదుట శనివారం నిరసన దీక్ష చేపట్టి కమిషనర్ రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, సిబ్బంది అందరిని రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ నెల 6న కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బండారి బాబు, నర్సయ్య, సమ్మయ్య, సాయన్న, అశోక్, మహేష్, కార్తీక్, రవి, సురేష్, శ్రీనివాస్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఎద్దులబండి ఢీకొని వ్యక్తి మృతి

భూపాలపల్లి రూరల్: ఎద్దుల బండి ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని దూదేకులపల్లి రోడ్డుపై చోటుకుంది. గ్రామస్తులు, మృతుడి బంధువులు తెలిపిన ప్రకారం.. గొల్లబుద్దారం గ్రామానికి చెందిన నేరటి వెంకన్న(55) దూదేకులపల్లికి వెళ్లి ద్విచక్రవాహనంపై వస్తున్న క్రమంలో దూదేకులపల్లి, గొల్లబుద్దారం మార్గమధ్యంలో ఎద్దుల బండి ఢీకొని తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య నాగమణి, ముగ్గురు కూతుళ్లు ఉండగా, ఇద్దరు కూతుళ్లకు వివాహాలు అయ్యాయి.

సోషల్ ఫోరం సేవలు అభినందనీయం

- ఎంఈఓ దేవ


అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో సోషల్ ఫోరం సేవలు అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి దేవ అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీ జ్ఞాని ప్రతిష్ట, తెలంగాణ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో జంగేడు ఉన్నత పాఠశాలలో శనివారం సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పోతర్ల సతీష్ అధ్యక్షతన సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజేతలకు నగదు బహుమతితో పాటు ప్రశంస పత్రాలను ఎంఈఓ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ లక్ష్మణ్, ఏసీఈజీ రవీందర్ రెడ్డి, ప్లానింగ్ కోఆర్డినేటర్ రాజగోపాల్, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీప్రసన్న, రాజ మల్లయ్య, ఫోరం నాయకులు శాంతా, రామ్ దాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



మొగుళ్లపల్లి: హనుమకొండ నుంచి మెట్టుపల్లి, మొట్లపల్లి మీదుగా మొగుళ్లపల్లి వరకు ప్రయాణికులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, జిల్లా నాయకులు గజ్జి రాజ్‌కుమార్ దేవేందర్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి గాజుల రవి, లింగారెడ్డి తదితరులు అందజేశారు.